# మోళ్ళు చిగురుస్తాయి

శ్రీమతి వాసిరెడ్డి
కాశీరత్నం

**అర్ధరాత్రి అంధకారం. చక్కటి వెన్నెలను పారద్రోలే చిక్కని చీకట్లు. శబ్దమో, నిశ్శబ్దమో తెలియని భ్రాంతి. మూగవోయిన మనసు. మూగన్ను పడ్డ కన్నులు. చాపమీద చీకటి గదిలో ఆలిసిపడివున్నది సీత**

హరికేన్ లాంతరు వెలుగు మొహం మీద పడింది. సీత కన్నులు తెరిచి చూసింది. దగ్గరగా లాంతరు పట్టుకునితల్లి దూరంగా చాకలిరామి. అది అన్నీ పట్టుకుని సిద్ధంగా వున్నది.

''సీతా చాకలిరామి వచ్చింది. లేచిరా, తెల్లవారకముందె తిరిగి రావాలి మనం.''

సీత అర్థం కానట్లు తల్లివైపూ, చాకలి రామివైపూ మార్చి మార్చి చూసింది. ఒక్క క్షణమే, ఆ మరుక్షణంలో ఆమెకంతా అర్థమయింది. అడుగు ముందుకు పడలేదు. ఈ పదిరోజులనుండి రాని దుఃఖం ఇవ్వాళే ముంచుకొచ్చింది. బలి పశువులాగా గింజుకు పోయింది సీత.

''అమ్మా, అర్ధరాత్రి ఏటి కెందుకమ్మా ఇక్కడే....ఇక్కడే స్నానంచేస్తే సరి పోలా?''

దుఃఖంతో సీత గొంతు పూడుకుపోయింది. తల్లికూతురు వైపు దిగాలుపడి చూసింది. తల్లీ కూతుళ్ళకెదురుగా చాకలి రామి. అది చీర చంకన ఇరికించుకుని ముందుకొచ్చింది.

''శానా దూరంలేదమ్మా ఏరు. కూసేపు పట్టదు, కాకపోతే నలుగురు నాలుగు మాట లంటారు; నేనుండగా మీకు భయమెందు కమ్మా?''

సీత నిట్టూర్చింది. తల్లివైపు చూసింది

''ఇప్పటికే మనం లోతు నీటిలో పీక బడి వున్నాం. తప్పులు దొరికితే సంఘం విడువదు. ఇది కాస్తా పూర్తి చేస్తే మన బ్రతుకు తెరిపినపడుతుంది.''

ఈ మాటలు నిజంగా తల్లి చెప్పలేదు. తల్లి కళ్ళల్లో అదే భావం చూసింది సీత. సీత గుండెల్లోనూ అదే పలికింది. తెరిపిన పడటం. ఎంత సత్యం? తెల్లవారితే తన బ్రతుకుకొక మార్గం ఏర్పడుతుంది. అది తాను నిశ్చయంచేసుకునే మార్గం. అందులో ఎవ్వరి జోక్యమూ వుండబోదు. తన పిల్లల కోసం ఏర్పరచుకునే క్రొత్త బాట.

సీత నిశ్శబ్దంగా వాళ్ళిద్దరి వెంటా బయలుదేరింది.

చాకలి రామి దారి పొడుగునా ఏదో చెపుతూనే వుంది.

''అమ్మా, ఎ న క టా చా రా లుం డా యమ్మా? మా యమ్మ సెప్పేదీ పూర్లో ఒక్క దొరపోతే ముత్తయిదువులంతా నీళ్ళే త్తిరికాడ లేచేవోరంటమ్మా. ఒక్క మంగళసూత్రం తెగితే నూటొక్క మంగళ

మూత్రాలు గజ గజా వొణికేవంట. అందుకని అప్పుడందరూ మొహాలు కడుక్కొని బొట్లు పెట్టుకునేవారంటమ్మా!"

ఈ ప్రసంగం సీత తల్లి కిష్టంగా లేదు. ఆమె నిశ్శబ్దంగా వూరుకున్నది. చాకలి కనుక్కున్నదేమో ప్రసంగం మార్చేసింది.

చాలా సంవత్సరాలుగా ఈ వూరి అలవాట్లూ, ఆచారాలూ సీతకు అర్థమవుతూ వచ్చినవే. మొదట చీదరించుకున్నది. చిరాకుపడింది. కాని ఒంటరిగా వీటిని ఎదిరించలేకపోయింది. క్రమంగా తలవొగ్గక తప్పలేదు.

* * *

ఏటి నీళ్ళు పాదాలను తాకుతుంటే ఎంతో హాయనిపించింది. ఆ నీళ్ళు చల్లగా, తల్లి తన బట్టలను ఓదారుస్తున్నంత చల్లగా తగిలాయి. చిరుగాలికి ఏటి వొడ్డున చెట్లు జాలిగా తల లూపాయి.

సీత జడపాయలు విప్పి నీటిలో మునిగింది. చాకలి తన పని చేసుకోసాగింది. గాజులు చిట్లించింది. మెళ్ళో తాడు తెంపేసింది, ఏటి నీటిలో కుంకుమ కరిగిపోయింది. చాకలి తెల్లచీర అందించగా సీత కట్టుకుని తల వెంట్రుకలు ముడిపెట్టుకుంది

సీత తల్లి ఏటి వైపు మొహం తిప్పి కూర్చుంది, ఏడుస్తున్నదో, కళ్ళు మూసుకు కూర్చుందో తెలియదు, ముగ్గురూ నోరు విప్పలేదు.

ఘడియలో తెల్లవారుతుందా? మందపవనాలు వీచే వేళ. గూటిలో పక్షులు వేకువజాము కోసం ఎదురు చూసేవేళ.

అది నిశ్శబ్దగానం. మనసెక్కడో విహరిస్తున్నది. ప్రస్తుతంలో నిలువనంటున్నది బాధో, భయమో ఏదీ తెలియదు.

ఒకప్పుడు........

వెన్నెల రాత్రిళ్ళు సీత కోసం ఎదురుచూసేవి. సీత లేకపోతే వెన్నెల చిన్నపోయేది. అట్లతద్దినాడు గోరింటాకు పెట్టుకుని తెల్లవారు ఝామున పులిహోరలో పెరుగు వేసుకు తిని వెన్నెలలో పరిగెత్తేది సీత,

ఆడపిల్లలందరూ ఒక్కచోట చేరితే...

"సీత చూడవే చంద్రరేఖ పెట్టుకున్నది"

"లక్ష్మి, బంతాకు వేసుకున్నావా? చక్కగా వుందే."

"రమకి చూడండి ఎంత బాగా పండిందో మంచి మొగుడొస్తాడు"

"గాజు లెప్పుడు వేసుకున్నావే?"

"నిన్న గాజులసెట్టి అట్లతద్దెకని గాజులు తెచ్చాడు మీ ఇంటికి రాలేదా?"

"అబ్బ, ఈ నీలి గాజులు నా కెంత ఇష్టమో"

"ఎవరు ముందు పరిగెడితే వాళ్ళకే వుయ్యాల."

గాజులు గలగలలాడించుకుంటూ అమ్మాయిలు పరిగెట్టారు. వారిలో కసుక్కున పల్లేరు కాయలు గుచ్చుకున్నాయి కవటాకులవంటి పాదాలు పుచ్చుకుని కూలబడిపోయారు అమ్మాయిలు, తుమ్మచెట్ల వెనక అబ్బాయిలు కిసుక్కున నవ్వారు.

వెన్నెలలో తళతళలాడిపోతున్న అమ్మాయిల మొహాలు కోపంతో ఎర్రబడిపోయాయి.

"ఎంత పొగరూ, మాష్టారుతో చెప్పి మీ పని పట్టించకపోతే చూసుకోండి,"

"అమ్మాయిలు మన పని పట్టిస్తారటోహో"



అబ్బాయిలు హోలోమని పరిగెట్టారు.

''ఛీ ఛీ, మడ్డిదున్నలు, ఎవరే వీళ్ళకు లీడరు?''

సీత రోషంగా అడిగింది.

“ఇంకెవరు? చంద్రయ్య కొడుకు - సూర్యం.''

సీత స్నేహితురాలు రమ చెప్పింది.

‘వూహూ, సరే.''

ఇంకేమీ మాట్లాడకుండా వుయ్యాల దగ్గరకు పరిగెత్తింది సీత.

నిజంగా ఆమె తెల్లవారి మాష్టారుతో చెప్పి సూర్యాన్ని కొట్టించిన సీత దిగాలు పడిపోయింది. మాష్టారు అంతలా కొడతారని అనుకోలేదు సీత. కొట్టవద్దని చెప్పటానికి వీల్లేక, కొడుతుంటే చూడలేక విలవిల్లాడిపోయింది.

సీత ప్రతిమాలితే నిర్లక్ష్యంగా నవ్వాడు సూర్యం.

"మాకు చేతనయింది మేం చేశాం. మీకు చేతనయింది మీరు చేశారు. మళ్ళీ బాధ పడటం ఎందుకు సీతమ్మవారూ!"

సీత మనస్సు వెనక్కు పోయి సూర్యం కోసం వెతుక్కున్నది. సూర్యం తన పరిస్థితుల నేమీ మార్చలేడు. మళ్ళీ వెనకటి రోజులు తెప్పించలేడు. అయినా సూర్యం కోసం మనస్సు ఘోషిస్తున్నది.

కాగితపు పడవలు చేసి వాననీళ్ళలో విసిరి ఆడుకున్న రోజులు, వానపాములు కాగితంలో చుట్టి మిత్రుల మీద విసిరి మాష్టారిచేత దెబ్బలుతిన్న రోజులు అన్నీ గుర్తొచ్చాయి, వాన పడుతుంటే బడిచుట్టూ తిప్పి సీత కింద జారిపడితే లేవదీసి ఓదార్చాడు సూర్యం.




ఆది కలలాంటి జీవితం. ఇట్టే కరిగిపోయింది. అసలు జీవితం ఇక్కడ ఈ వూళ్లో ప్రారంభమయింది.

సీత అందం విలువ లేనిదై - భర్త అనుమానాలకు ఆస్కారమయింది. ఆమె చదివిన చదువు - పని చేతకాదని సాధించే అత్తగారి వుపన్యాసాలకు వుపయోగించింది.

మరుభూమిలో విత్తనమయింది బ్రతుకు.

ఎందుకో తెలియని జీవితం, సుఖమో దుఃఖమో అర్థంకాని జీవితం. దాని కంతు లేదు. విదలించి పారిపోతానంటే చెవిరించి బెట్టింది. మునులకు కూడా అలవికానంత నిర్లిప్త జీవితాన్ని అత్తింటి కోడళ్ళు మాత్రమే గడపగలరేమో.

"అమ్మా, త్వరగా నడవండి. తెల్లారొస్తున్నది."

చాకలి హెచ్చరిస్తున్నది. సీత వులిక్కిపడి చుట్టూ చూసింది.

చీకట్లో నిశ్శబ్దంగా ఎదురు చూస్తున్నది ఇల్లు. పిల్లలిద్దరూ నిద్ర లేవలేదు.

తెల్లవారితే క్రొత్త జీవితం. సీత తనకు తానై ఏర్పరచుకోవలసిన జీవితం. పిల్లల భవిష్యత్తుకోసం మంచి పునాది వేయాలి.

కుట్టుమిషనా? పిల్లలకు ప్రయివేట్లూ పాడిగేదెలూనా? ఎన్నో ప్లాన్లు.

అయితే ఇన్నాళ్ళనుండీ సీత భర్త మరణంకోసం ఎదురు చూసిందా? ఛీ, ఛీ ఎంత అసహ్యంగా ఆలోచిస్తున్నానని తనని తాను తిట్టుకున్నది సీత.

"కాదు, కాదు,"

గిలగిల లాడింది సీత మనసు.

అయితే సీత ఈ పదిరోజులనుండీ అందరి ఆడవాళ్ళలా తల గోడకు కొట్టుకుని ఏడవలేదు. ముందుజీవితమేమిటని ప్రశ్నలు వేసి జవాబులు చెప్పుకున్నది.

ఒకప్పుడు భర్తని మనసులో నిరసించింది. నిష్క్రియాపరుడనీ, పేకాటరాయుడనీ తిట్టుకున్నది. తామిద్దరూ ప్రేమగా మాట్లాడుకున్న క్షణాలున్నాయా? లేవు. అతను రచ్చబండదగ్గర కాలం గడిపాడు. ఆమె వంటింటి పొగలో కూరుకుపోయింది.

కష్టపడి డబ్బు సంపాదించవలసిన కొడుకు కాలం విలువ తెలియకుండా దుర్వినియోగం చేస్తుంటే అతని తల్లి కోడలిమీద విసుక్కుంది. డబ్బులు చాలనపుడు భర్త సీతమీద చేయి చేసుకునేవాడు.

అవన్నీ గడచిన గాథలు. వాటిలో బాధలే మిక్కుటం.

ఇప్పుడేమీ లేదు.

ఏడుపూ, బాధా సుఖమూ ఏదీ తెలియని నిర్లిప్తత.

వెలుగు కిరణాలు దూసుకొస్తుంటే ఆవైపు ఆశగా చూస్తూ నిలబడింది సీత. ●

---

## ● మృగరాజసం

అప్పుడే నిద్రలేచిన సింహం అలా షికారుగా తిరిగొద్దామని బయలుదేరింది. దోవలో ఒక పెద్దపులి ఎదురైంది. సింహం దాన్ని నిలేసి "నేనెవరినో తెలుసా?" అని అడిగింది.

"ఎవరేమిటిసార్ తమరు మృగరాజులు పంచాననులు, హర్యక్షులు" అని భట్రాజులా పొగిడింది పెద్ద పులి.

"సరే పో" అని, సింహం ముందుకు సాగింది.

కొంతదూరం పోయాక తోడేలు ఎదురైంది. దాన్నికూడా సింహం అడిగింది "నేనెవరో తెలుసా?" తోడేలు నక్కలా వణికిపోతూ "త-త-తమరు తెలియకేమండి. ఏలికోయ్, దొడ్డ పెబువులు రచ్చించాలి" అంది.

"అంచేత వెళ్ళో నీ దారిన్నువ్వు" అని సింహం ఇంకా ముందుకుపోయింది.

దారికడ్డంగా ఒక ఏనుగు నుంచుంది. సింహం దాని దగ్గరకెళ్ళి "నేనెవర్నో తెలుసా?" అంది.

ఏనుగు దానికేసి ఓరగా చూసింది. తొండంతో లుంగచుట్టి సింహాన్ని ఎత్తి గిరాటేసింది.

సింహం ఒళ్ళు దులుపుకుంటూ లేచి "తెలియకపోతే తెలియదనొచ్చుగా? ఎత్తి పడెయ్యాలేమిటి బడాయిగా?" అని ఠీవిగా వెళ్ళిపోయింది.